ప్రజాశక్తి
శుక్రవారం 10 జనవరి 2025
5
అనంతపురం

సమ్మెకాలం హామీలను అమలు చేయండి

మున్సిపల్ కార్మికుల రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

గతంలో మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలకు సంబంధించిన జీవోలను వెంటనే అమలు చేయాలని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, సిఐటియు 2వ నగర ప్రధాన కార్యదర్శి ముర్తుజా, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం, నగర ప్రధాన కార్యదర్శి తిరుమలేశు మాట్లాడుతూ రెగ్యులర్ కార్మికులకు మూడేళ్లుగా బకాయి ఉన్న సరెండర్ లీవ్, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేసి రిటైర్‌మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. అలాగే ఇంక్రిమెంట్లు, జిపిఎఫ్ అకౌంట్లు, మెరుగైన 12వ పిఆర్‌సి అమలు చేయాలని, కనీస వేతనం రూ.21వేలు ఇవ్వాలని, బకాయి ఇపిఎఫ్ డబ్బులను కార్మికుల ఖాతాలో జమచేయాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.75వేలు ఇవ్వాలని, 60ఏళ్ల నెపంతో తొలగించిన 12 మంది కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలి, ప్రభుత్వ సంక్షేమ పథకాలతోపాటు రిస్క్ అలవెన్స్ అమలు చేయాలన్నారు. వీటితోపాటు అనేక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటాలు మరింత ఉధృతం చేసి నిరవధిక సమ్మెలోకి వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా కోశాధికారి ఆదినారాయణ, నగర కోశాధికారి లక్ష్మీనరసమ్మ, నగర ఉపాధ్యక్షులు శేషేంద్రకుమార్, ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కెవిపిఎస్ నగర అధ్యక్షులు అక్కులప్ప, కమిటీ సభ్యులు పుల్లన్న, నాగేంద్ర, శ్రీనివాసమూర్తి, కిరణ్, శీన, మంజుల, చలపతి, రాఘవేంద్ర ప్రసాద్, నల్లప్ప, పెన్నోబులేసు, హిమాంబి, జయరాం, నారాయణస్వామి, కుమార్, నారాయణ, పెద్దన్న, శివ, ప్రభాకర్, కార్మికులు పాల్గొన్నారు.

రిలేదీక్షల్లో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

ఎఫ్‌పిపిసిఎ బాదుడు..!

- విద్యుత్ బిల్లులో ఒకేసారి మూడు అదనపు భారాలు
- హడలెత్తిపోతున్న వినియోగదారులు
- వినియోగించిన కరెంట్ కంటే ఇతర ఛార్జీలే అధికం
- సామాన్య ప్రజానీకం విలవిల



విద్యుత్ బిల్లులో ఎఫ్‌పిపిసిఎ బాదుడు జనం నడ్డివిరుస్తోంది. వాడిన విద్యుత్ కంటే అదనపు ఛార్జీలే బిల్లులో ఎక్కువగా వచ్చాయి. గత నెలలో రెండు అదనపు ఛార్జీలు ఉండగా ఈ నెల మరొకదాన్ని కలిపి ఇచ్చారు. దీంతో విద్యుత్ బిల్లులు తడిసి మోపెడవుతున్నాయి. ఈ భారాలపై గత ప్రభుత్వం తప్పిదం అంటూ కూటమి సర్కార్ తప్పించుకునే పనిలో పడగా, ఈ భారమంతా కూటమి ప్రభుత్వానిదేనంటూ వైసీపీ విమర్శలు చేస్తోంది. ఇలా ఈ రెండు పార్టీల విధానాలతో జనాల నెత్తిన అదనపు భారాలు పడుతున్నాయి. వినియోగదారులు వినియోగించిన విద్యుత్‌కు వస్తున్న కరెంట్ బిల్లులకు ఏమాత్రం సంబంధం లేకుండా ఉంది. ఈ నెల వచ్చిన విద్యుత్ బిల్లులను చూసి జనాలు లబోదిబోమంటున్నారు.

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 13 లక్షలకు పైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో మూడొంతల విద్యుత్ కనెక్షన్లు సామాన్య ప్రజానీకానికి సంబంధించినవే. డిసెంబర్ నెలలో ఎఫ్‌పిపిసిఎ (ఫ్యూయల్ అండ్ పవర్ పర్చస్ కాస్ట్ అడ్జస్ట్మెంట్) ఛార్జీలు రెండు ఉండగా, జనవరి నెలలో ఎఫ్‌బిపిసిఎ భారాలు చేరాయి. దీంతో బిల్లుల మోత మోగుతోంది. 2022-23, 2023-24 సంవత్సరాలకు సంబంధించిన విద్యుత్ పంపిణీలు అదనపు ఖర్చుల పేరుతో జనాలపై విద్యుత్ బిల్లుల బాదుడు తారస్థాయికి చేరింది. విద్యుత్ బిల్లులో సగం అదనపు ఛార్జీల భారమే ఉంటోంది. గత వైసిపి పాలనలో ఏడుసార్లు అదనపు ఛార్జీల భారం వడ్డించగా, కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లో రెండు సార్లు అదనపు ఛార్జీల భారం మోపింది. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీల పెంచబోమంటూ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వరుస విద్యుత్ ఛార్జీల భారాన్ని జనంపై వేస్తోంది. ప్రస్తుతం శీతాకాలం కావడంతో విద్యుత్ వాడకం తక్కువగా ఉంటుంది. చలి విపరీతంగా ఉండడంతో ఫ్యాన్ కూడా వేసుకోలేని పరిస్థితి ఉంది. ఇక ఏసీ, ఎయిర్ కూలర్లను వినియోగించడం లేదు. ఇలాంటి సమయంలోనే సామాన్యులకు సైతం రూ.500పైగా విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. ఇక వేసవి వస్తే పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

"హిందూపురం పట్టణంలోని ధర్మపురంలో నివాసముంటున్న కృష్ణమూర్తి డిసెంబర్ నెలలో వినియోగించిన విద్యుత్‌కు జనవరి నెలలో విద్యుత్ శాఖ బిల్లు ఇచ్చారు. ఇందులో విద్యుత్ వినియోగించినందుకు రూ.741 బిల్లు ఉండగా, రూ.414 అదనపు ఛార్జీలను చేర్చి మొత్తం రూ.1155 ఇచ్చారు. పట్టణంలో నివాసముంటున్న బాబా ఫక్రుద్దీన్ వినియోగించిన విద్యుత్‌కు రూ.246 బిల్లు వస్తే అదనపు ఛార్జీలు రూ. 447 కలిపి మొత్తం రూ.693 బిల్లు వచ్చింది. ఈయనకు వాడిన విద్యుత్ బిల్లు కంటే అదనపు ఛార్జీలే అధికంగా పడ్డాయి. ఇది వీరిద్దరి పరిస్థితే కాదు ప్రతి ఒక్క విద్యుత్ వినియోగదారునిపై అదనపు బాదడు తడిసి మోపెడవుతోంది".

గట్టిగానే భారాలు..!

ప్రజలకు పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు గొప్పలు చెబుతున్న కూటమి ప్రభుత్వం మరోపక్క భారాలను గట్టిగానే మోపుతుంది. గడిచిన ఆరు నెలల్లో రెండు ఎఫ్‌పిపిసిఎ విద్యుత్ భారాలను జనాలపై మోపింది. వంటనూనె, ఇతర నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయి. దీనికి తోడు కరెంటు ఛార్జీల పేరుతో మరింత భారాన్ని జనంపై వేస్తోంది. కరెంట్ బిల్లులో ఫిక్స్డ్, కస్టమర్, ఈడి, సర్ ఛార్జీలు, ఎఫ్‌పిపిసిఎ ఛార్జీల మోత మోగుతోంది. విద్యుత్ ఛార్జీల పేరుతో ప్రభుత్వం జనాలను పీల్చి పిప్పి చేస్తుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

CALL 1912
CUSTOMER CARE 24/7
APSPDCL
Demand / Disconnection notice
(As per APERC Reg No.5 of 2004)

CIRCLE	ANANTHAPUR
BILL DATE	07-01-25 11:41
BILL NO	7315607011141381125
NAME	KRISHNA MURTHY D
USC NO	7311101017597
Aadhar Number	XXXXXXXX7680
Mobile Number	XXXXXX2227
SECTION	HINDUPUR-D1
Bill Method	IrDA
METER NO	34724847
Meter Type	IRDA
DTR Code	307311130021
POS	DOMESTIC (A)
CAT:LT1 SUB CAT:0 PH :1	
CONTRACTED LOAD	.99
BILL PERIOD	07.01.25 06.12.24

	PRESENT	PREVIOUS
MTR STATUS	01	01
KWH	8821.0	8642
KVAH	0	0
SOLAR	0.0	0
OLD MTR KWH		0
OLD MTR KVAH		0

BILLED UNITS	179.0/0.0
AVERAGE UNITS	211
SOLAR UNITS	0.0
NET UNITS :	179.0
RECORDED M.D : 1.0	MF :1
MIN/ENERGY CHRGS	741.00
FIXED CHARGES	10.00
CUSTOMER CHARGES	50.00
ELECTRICITY DUTY	10.74
FPPCA(2022_05)	90.00
FPPCA(2023_05)	78.08
FPPCA(2024_12)	71.20
INTEREST ON ED	0.06
SURCHARGE	25.00
OTHER CHARGES	0.00
ADJUSTMENTS	0.00
TrueUp Charges(30/36)	79.16
AP GOVT SUBSIDY	0.00
Loss/Gain (+ / -)	-0.24
BILL AMT	Rs.1155.00
ARREARS	0.00
TOTAL DUE	Rs.1155.00
AGL Demand	0.00
ACD Amount	0.00
Development Charges	0.00
DUE DATE	22-Jan-2025
DISCONNECTION DATE	07-Feb-2025
LAST PAID :1095 on 29-12-2024	

జనవరి నెలలో వచ్చిన బిల్లులో ఎఫ్‌పిపిసిఎ బాదుడు

భారాలు భరించలేం...

అదనపు ఛార్జీలు భరించలేకపోతున్నాం. వాడుకున్న కరెంటు కంటే అదనపు ఛార్జీల భారంతో నలిగిపోతున్నాం. అనేక ఛార్జీల పేరుతో భారం వేస్తున్నారు. గత నెల బిల్లుకంటే ఈ నెల బిల్లులో రూ.260 వరకు అదనపు ఛార్జీల భారం పడింది. అదనపు ఛార్జీలు భరించలేని స్థాయికి చేరాయి. ప్రభుత్వాలు మారినా భారాలు మాత్రం తగ్గలేదు. ఇలాగైతే సామాన్యులు ఎలా బతకాలో ప్రభుత్వమే చెప్పాలి.

రవి కుమార్, చౌళూరు.

సర్దుబాటు పేరుతో భారాలా..

కూటమి ప్రభుత్వం విద్యుత్ సర్దుబాటు పేరుతో జనంపై అదనపు బాదుడు వేస్తోంది. ప్రతి పక్షంలో ఉన్న సమయంలో విద్యుత్ ఛార్జీలపై బాదుడే బాదుడు కార్యక్రమం చేపట్టి, అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వని కన్న అదనంగా విద్యుత్ ఛార్జీలు బాదుతున్నారు. వెంటనే వీటిని ఉపసంహరించుకోవాలి. లేని పక్షంలో ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతాం.

సిఐటియు జిల్లా కార్యదర్శి ఈఎస్.వెంకటేష్.

పత్తి పంట సాగుకు ప్రోత్సాహం

చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.సునీత

పత్తిని పరిశీలిస్తున్న చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

దేశీయ పత్తి పంటను జిల్లాలో పెద్దఎత్తున సాగుచేయాలని, ప్రకతి వ్యవసాయం ద్వారా సురక్ష, సూరజ్ అనే రెండు రకాల పత్తి పంటలు సాగు విస్తీర్ణం మరింత పెంచేందుకు తగిగన ప్రోత్సాహం ఇవ్వాలని చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కె.సునీత పేర్కొన్నారు. గురువారం సాయంత్రం పెద్దవడుగూరు మండలం మిడుతూరు గ్రామ పరిధిలో ప్రకతి వ్యవసాయం ద్వారా సాగుచేసిన దేశీయ పత్తి పంట పొలాలను కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌తో కలిసి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మహిళా రైతు సుంకమ్మ, వెంకట్ రెడ్డి, ఎస్తేర్ రాణి పత్తి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రెటరీ కె.సునీత మాట్లాడుతూ దేశీయ పత్తి రకాలైన సురక్ష, సూరజ్ అనే రెండు రకాల పత్తి పంటలు సాగు చేయడం జరగగా, హైబ్రిడ్ బిటి పత్తి విత్తనాల కంటే దేశీయ పత్తి రకాల సాగు వల్ల 3 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి ఎక్కువ వస్తుందన్నారు. అంతర్ పంటలుగా జొన్న, కంది, సజ్జ, ఆకుకూరలు, గోంగూర, తదితర పంటలు సాగు చేయవచ్చన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ అధిక దిగుబడిని ఇచ్చి ప్రకతి వైపరీత్యాలను తట్టుకునే దేశీయ పత్తి రకాలైన సురక్ష, సూరజ్ పత్తి రకాలను అధికంగా సాగు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, ప్రకతి వ్యవసాయం సిటిఐఒ, డీపీఎం లక్ష్మనాయక్, తహశీల్దార్ ఉషారాణి, వ్యవసాయ అధికారి మల్లేశ్వరి, బెటర్ కాటన్ ప్రోడక్ట్ డైరెక్టర్ దినేష్ రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

చీనీ ప్రాసెసింగ్ యూనిట్ లాభదాయకం

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-గార్లదిన్నె

చీనీ ప్రాసెసింగ్ యూనిట్‌ను నెలకొల్పడం వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభించి లాభదాయకంగా ఉంటుందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. గురువారం ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులతో అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోనే అధికంగా గార్లదిన్నె మండలంలో చీనీ పంటను సాగు చేస్తున్నారన్నారు. చీనీ రైతుల సౌకర్యార్థమే చీనీ ప్రాసెసింగ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. చీనీ రైతులకు లాభం చేకూరడంతోపాటు చాలామందికి ఉపాధి దొరుకుతుందన్నారు. దీనికోసం ప్రభుత్వం నుంచి రూ.3.50కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. త్వరలోనే భూ సేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ సెక్యూరిటీ అధికారి శేఖర్‌బాబు, తహశీల్దార్ ఈరమ్మ, హార్టికల్చర్ ఆఫీసర్ రత్నకుమార్, మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్, ఎంపిడిఒ యోగానందరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి పటిష్ట బందోబస్తు

ఎస్పీ పి.జగదీష్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఎస్పీ జగదీష్

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లాలోని ఆలయాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ పి.జగదీష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయాలు, పరిసరాల్లో అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసులు చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బందోబస్తు విధుల కోసం పోలీసు సిబ్బందిని కేటాయించామన్నారు. భక్తులు అసౌకర్యానికి గురి కాకుండా ఏర్పాట్లు చేసుకునే విధంగా ఆలయ కమిటీలకు సూచించామన్నారు. భక్తులు తాకిడి అధికంగా ఉన్న ఆలయాల వద్ద బ్యారికేడింగ్, క్యూ మెయింటెనెన్స్ తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఆలయాలు, పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా బందోబస్తుతోపాటు ఆయా పరిసరాల్లో దొంగతనాలు జరుగకుండా ప్రత్యేక నిఘా వేశామన్నారు. గస్తీ పెంచామన్నారు. మొబైల్ సెక్యూరిటీ హ్యాండ్ హోల్డ్ డివైస్ (పాపిల్లాన్ మొబైల్ డివైస్) ద్వారా అనుమానితులను చెక్ చేయనున్నారని తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో గురువారం సంఘం అధ్యక్షులు శివప్రసాద్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా పెన్షనర్స్ సంఘం అధ్యక్షులు పెద్దన్నగౌడ్ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా ప్రభాకర్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షులుగా మల్లికార్జున, ప్రధాన కార్యదర్శిగా తిప్పేస్వామి, గౌరవాధ్యక్షులుగా కృష్ణయ్యచౌదరి, కోశాధికారిగా అంపన్న, అసోసియేటెడ్ ప్రెసిడెంట్ కె.పాతిరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రూమన్ టెక్నాలజీస్‌తో జెఎన్‌టియు ఒప్పందం

ఇన్‌ఛార్జి విసి హెచ్.సుదర్శనరావు

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు బెంగళూరు రూమన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందం చేసుకున్నట్లు జెఎన్‌టియు ఇన్‌ఛార్జి ఉపకులపతి హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య గురువారం తెలిపారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఈ ఒప్పందంతో అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో చదివే విద్యార్థులకు ఉపయోగకరమని తెలిపారు. సాఫ్ట్ స్కిల్స్‌తో పెంపొందించుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఈ ఒప్పందాన్ని విద్యార్థులు అందరూ సద్వియోగం చేసుకునేలా అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డి టూ వీసీ ఎన్.దేవన్న, అకాడమిక్ ప్లానింగ్ డైరెక్టర్ ఎస్‌వి.సత్యనారాయణ, బెంగళూరు రూమన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు రక్షిత్ శెట్టి, డైరెక్టర్ బి.వెంకట్ రెడ్డి, ప్రాజెక్టు మేనజర్ పిఆర్.భానుమూర్తి, పి.సుజాత, సి.శోభాబిందు, జి.ప్రశాంతి, బి.ఈశ్వర్ రెడ్డి, కిరణ్మయి, సురేష్ బాబు, వైశాలి ఘోర్పడే, శివ కుమార్, ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి పాల్గొన్నారు.

ఒప్పంద పత్రాలను చూపుతున్న ఇన్‌ఛార్జి విసి సుదర్శనరావు

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో "ఆర్థిక మోసాల నివారణ" అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని ఎంబిఎ విభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ హిమాన్షు సైని ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డిజిటల్ యుగంలో ఆర్థిక మోసాలు అధికం అయ్యాయన్నారు. సెల్‌ఫోన్లకు గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింకులను ఓపెన్ చేయరాదన్నారు. ఇలాంటి వాటిపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ప్రొఫెసర్ చంద్రమోహన్ రెడ్డి, డాక్టర్ పి.శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలు కోసం 17న ధర్నా : రైతుసంఘం

సమావేశంలో మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో రైతులు, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక గణేనాయక్ భవన్‌లోని రైతు సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం జాప్యం చేస్తోందన్నారు. వీటని నిరసిస్తూ ఈనెల 17న విజయవాడ ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామని వాగ్దానం చేసిందన్నారు. ఖరీఫ్ సీజన్ ముగిసిందని, రబీ సీజన్లో కూడా సగం కాలం గడిచిందన్నారు. అయినా పెట్టుబడి సాయం ఇవ్వలేదన్నారు. కరువుకు గురైన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదన్నారు. ఉచిత పంటల బీమా రద్దు చేసి రైతుల ప్రీమియం రైతులే చెల్లించాలని జీవో ఇచ్చిందన్నారు. దీని వల్ల లక్షలాది మంది రైతులు బీమా కట్టలేక ఉండిపోయారని తెలిపారు. 2023 ఖరీఫ్ రబీ ఇన్సూరెన్స్ ప్రకటించాలన్నారు. హంద్రీనీవా కాలువకు సంబంధించి 404,405, జీవో రద్దు చేయాలన్నారు. డ్రిప్పు స్ప్రింక్లర్లు 10 ఎకరాల వరకు 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉచితంగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి శివారెడ్డి, ఎన్.మధుసూదన్, రాజారాం రెడ్డి, బిహెచ్.రాయుడు, పోతలయ్య, వెంకట్ నాయుడు, నారాయణరెడ్డి, ఈరప్ప, నాగమ్మ, చిదంబరమ్మ, సువర్ణమ్మ, వలీ, కొండారెడ్డి, శ్రీనివాసులు, మద్దిలేటి పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై ర్యాలీ, అవగాహన



రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్టీవో రమేష్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ప్రతి ఒక్కరూ విధిగా రోడ్డు నిబంధనలు పాటించాలని ఆర్‌టిఒ రమేష్ సూచించారు. రోడ్డు భద్రతపై గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్(ఆర్‌డిటి) ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పట్టణంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథులుగా ఆర్‌డిటి ఛైర్మన్ తిప్పేస్వామి, రీజినల్ డైరెక్టర్ సుబ్బారెడ్డి, ఆర్‌టిఎ అధికారులు రమేష్, ఎఎంఐ లహరి, కళాశాల ప్రిన్సిపల్ మల్లికార్జున, ఎఎస్ఐ రామాంజనేయులు, పాల్గొన్నారు. విధిగా హెల్మెట్ వాడాలని, సీట్ బెల్ట్ ధరించి వాహనం నడపాన్నారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు జగన్నాథ్, జయలక్ష్మి, చిక్క బొమ్మన్న, వెంకటేష్ బాబు, బాపూజీ పాల్గొన్నారు.

విద్యార్థులకు వేమన పద్య పఠన పోటీలు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం వేమన పద్య పఠన పోటీలు నిర్వహించినట్లు హెచ్ఎం చంద్రమౌళి తెలిపారు. ప్రజాకవి వేమన జయంతి పురస్కరించుకుని వేమన ఫౌండేషన్ అనంతపురం వారి సహకారంతో స్థానిక జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు వేమన పద్య పఠన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం చంద్రమౌళి మాట్లాడుతూ వేమన పద్యాలను అందరూ చదివి, అందులోని నీతిని గ్రహించి సమాజ హితం కోసం పాటుపడాలని సూచిం చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బ్రహ్మచైతన్య, అర్చన, రవికుమార్, హనుమంతరెడ్డి, వెంకట నారాయణ, విజయలక్ష్మి, సాయిగీత, గోపాల్‌నాయక్, కృష్ణమూర్తి, శ్రీనివాసులు, వ్యాయామ ఉపాధ్యాయుడు ఇబ్రహీం, విద్యార్థులు పాల్గొన్నారు.

డాకు మహారాజ్ ప్రీరిలీజ్ ఈవెంట్ రద్దు

తిరుపతి ఘటన నేపథ్యంలో నిర్ణయం

ప్రజాశక్తి-అనంతపురం

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం జిల్లా కేంద్రంలో గురువారం జరగాల్సిన నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహారాజ్ చిత్రం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను రద్దు చేశారు. తిరుపతి తొక్కిసిలాట ఘటనలో ఆరుగురు భక్తులు మరణించిన ఘటన నేపథ్యంలో చిత్ర యూనిట్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌తో పాటు బాలకృష్ణ అభిమాన సంఘం నాయకులు గౌస్ మోద్దీన్, జగన్, శ్రీధర్ రాయల్‌లు ఈ విషయాన్ని గురువారం విలేకరులకు వెల్లడించారు. తిరుపతి ఘటనలో ఆరు మంది భక్తులు చనిపోవడం చాలా బాధ కలిగించిందని, ఇలాంటి బాధాకరమైన పరిస్థితుల్లో బాలకృష్ణ సూచన మేరకు సినిమా ఈవెంట్‌ను రద్దు చేసుకున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. సినిమా రిలీజ్ తర్వాత మరో కార్యక్రమం నిర్వహణపై చిత్ర యూనిట్ ప్రకటిస్తుందని తెలిపారు. ఈవెంట్ రద్దు అయినందుకు అభిమానులు ఎవరూ నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని, త్వరలోనే అనంతపురంలో మరో భారీ ఈవెంట్ నిర్వహిస్తామని తెలిపారు. కాగా గురువారం నాడు సినిమా ఈవెంట్‌తో పాటు జెఎన్‌టియులో నిర్వహించే ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంత్రి నారా లోకేష్ అనంతపురం రావాల్సి ఉంది. ఈయన కూడా తన పర్యటనను రద్దు చేసుకున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల తనిఖీ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలోని ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను గురువారం కడప ఆర్‌జెడి డాక్టర్ డి.నాగ లింగారెడ్డి సందర్శించారు. ఆయన తరగతి గదులు, ల్యాబ్‌లు, మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం నిర్వహించి, విద్యార్థుల ఉత్తీర్ణత, హాజరు శాతం పెంచాలని, రాబోయే విద్యా సంవత్సరానికి అడ్మిషన్ డ్రైవ్ చేపట్టాలని సూచించారు. మౌలిక వసతుల కల్పనపై సంతృప్తి వ్యక్తం చేసి ప్రిన్సిపల్‌ను అభినందించారు. ఆయన వెంట ప్రిన్సిపల్ డాక్టర్ డి.జయరామిరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ శేషయ్య, పౌర సంబంధాల అధికారి డాక్టర్ కె.శ్రీధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'బాలమేధావి'లో సంక్రాంతి సంబరాలు

డి.హీరేహాల్ : మండలంలోని కల్యం గ్రామంలో ఉన్న బాల మేధావి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో గురు వారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కరస్పాండెంట్ ఎం.వన్నూరుస్వామి విద్యార్థులకు సంక్రాంతి పండుగ విశిష్టత, ప్రాముఖ్యతను వివరించారు. అలాగే వ్యాసరచన, చిత్రలేఖనం, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమక్షంలో భోగి మంటలు వేసి సంబరాలు చేసుకున్నారు.

కిడ్నీ బాధితురాలికి ఆర్థికసాయం

కళ్యాణదుర్గం రూరల్ : కిడ్నీ బాధితురాలి వైద్య ఖర్చులకు గురువారం ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ బద్దేనాయక్ రూ. 15వేలు అందజేశారు. శెట్టూరు మండలంలోని లక్ష్మంపల్లి గ్రామానికి చెందిన బోయ సరస్వతమ్మ కు కిడ్నీలు పాడవడంతో 3 నెలలుగా డయాలసిస్ చేస్తున్నారు. ఆ గ్రామ యువకుల ద్వారా ఆమె కుటుంబ పరిస్థితి తెలుసుకున్న బద్దేనాయక్ మండలంలోని మాకొడికి పాఠశాలలో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో సరస్వతమ్మ కుమారుడు అశోక్‌కు ఉపాధ్యాయురాలు ఈశ్వరమ్మ ద్వారా రూ. 15వేలు అందజేశారు.

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలి

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వై.మధుసూదనరెడ్డి

నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

పార్లమెంటులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పి పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వై.మధుసూదనరెడ్డి డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక ఆర్‌అండ్‌బి బంగ్లా వద్ద నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ ప్రజల అభివృద్ధి కోసం తన జీవితాన్నే పణంగా పెట్టి దేశానికి మహోన్నతమైన రాజ్యాంగాన్ని అందించిన అంబేద్కర్‌ను కించపరిచే విధంగా మాట్లాడటం దౌర్భాగ్యమన్నారు. అలాంటి గొప్ప వ్యక్తిని కేవలం స్వార్థ రాజకీయాలు, మత రాజకీయాలు పెంపొందించుకోవడానికి ఇష్టానుసారంగా మాట్లాడితే ప్రజలు క్షమించరన్నారు. ప్రజాస్వామ్య విధానాలను కాలరాస్తూ ఆర్‌ఎస్‌ఎస్ విధానాలను దేశ ప్రజలపై బలవంతంగా రుద్దే విధంగా ప్రయత్నాలు చేస్తున్న బిజెపిని భూస్థాపితం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బ్యాళ శివప్రసాద్, జిల్లా కార్యదర్శి సోనియా సీనా, మైనార్టీ వింగ్ రాష్ట్ర నాయకులు అబ్బాస్, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పి పదవికి రాజీనామా చేయాలని శింగనమల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా ఒబిసి చైర్మన్ రామిరెడ్డియాదవ్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఒబిసి జిల్లా నాయకులు బండి రామాంజనేయులు, బుక్కరాయసముద్రం కన్వీనర్ మాడిశెట్టి సురేష్, మైనార్టీ నాయకులు రఫీ, రాజు కురువ, గట్టునాయక్, రుషింగప్ప, కృష్ణారెడ్డి, చిన్న కమ్మన్న, శివశంకరయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏలకు ఉద్యోగోన్నతులు కల్పించాలి


పోస్టర్లను విడుదల చేస్తున్న వీఆర్‌ఏలు

ప్రజాశక్తి-శింగనమల

అర్హులైన వీఆర్‌ఏలకు వీఆర్‌ఓలుగా పదోన్నతులు ఇవ్వాలని వీఆర్‌ఏల జిల్లా అధ్యక్షులు వి.ఓబిలేష్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా గ్రామాల్లో వీఆర్‌ఏలుగా విధులు నిర్వహిస్తున్న అర్హులందరికీ పదోన్నతులు కల్పించి న్యాయం చేయాలన్నారు. అలాగే చాలామంది ఇప్పటికీ నామినీలుగానే వీఆర్‌ఏలుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. వారిని రెగ్యులర్ వీఆర్‌ఏలుగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ వాల్మీకి నాగరాజు, జిల్లా సహాయ అధ్యక్షులు చంద్రమోహన్, నాగరాజు, గ్రామ రెవెన్యూ సహాయకులు రామాంజనేయులు, ధనుంజయ, శ్రీనివాసులు, వరదరాజులు, నాగరాజు, దేవదాసు, మౌలాలి, వెంకటేష్, నాగరత్న, ఓబులేసు, భాజాబీ, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తులు సంయమనం పాటించాలి

ప్రజాశక్తి-గుంతకల్లు

వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని రాజేంద్రనగర్‌లో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన ఉత్తరద్వార దర్శనంలో భక్తులు సంయమనం పాటించాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు భాస్కర్ రంగయ్య, కార్యదర్శి నారాయణస్వామి కోరారు. గురువారం స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతిలో టోకన్ల కోసం గురువారం రాత్రి జరిగిన ఘటనలో ఆరుగురు భక్తులు మృతి చెందడం బాధాకరమన్నారు. అయితే ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా గుంతకల్లులో రాజేంద్రనగర్‌లో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 7 గంటల నుంచి రాత్రి 11గంటల వరకు ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశామన్నారు. కావున భక్తులు సంయమనం పాటించి దర్శనం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ కోశాధికారి గుండా సుధాకర్ గుప్త, కమిటీ సభ్యులు సుదర్శన్ బాబు, జయంతి వెంకట్, ప్రవీణ్‌కుమార్, రమేష్‌రెడ్డి, అశ్వర్థమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సి మోడల్ పుస్తకాలు వితరణ

మోడల్ పేపర్ పుస్తకాలతో విద్యార్థినులు

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణ పరిధిలోని కెజిబివి పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 40 మంది విద్యార్థినులకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సి మోడల్ పేపర్ పుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఇఒలు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు మాట్లాడుతూ యుటిఎఫ్ రూపొందించిన ఎస్ఎస్‌సి మోడల్ పరీక్ష పుస్తకాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. గతేడాది కూడా పబ్లిక్ పరీక్షల్లో ఈ పుస్తకాలు చదివిన విద్యార్థులకు మంచి మార్కులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో పుస్తకాల దాత జానకి, కెజిబివి ప్రిన్సిపాల్ మహముదా బేగం, యుటిఎఫ్ జిల్లా కోశాధికారి రాఘవేంద్ర, పట్టణ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ, రాజకుమార్, పట్టణ గౌరవాధ్యక్షులు మల్లికార్జున, కోశాధికారి యల్లన్న, జిల్లా కౌన్సిలర్లు శంకరయ్య, అబ్దుల్ రఫీ, కార్యదర్శులు చిన్న రంగన్న, విశ్వేశ్వరబాబు, తమ్మారెడ్డి, ఇమాన్యుయల్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం

శింగనమల : టిడిపి సీనియర్ నాయకురాలు బండారు లీలావతి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు గురువారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రవీణ్ కుమార్, డాక్టర్ చంద్రకళ, ఏఎన్ఎం తిరుపాలమ్మ, దివ్య, మండల ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సమస్యలపై విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

మండల సమావేశంలో సర్పంచుల ఆగ్రహం

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి జి.విశాలాక్షి

ప్రజాశక్తి-గుత్తి

గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలపై ఎపిఎస్‌పిడిసిఎల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి జి.విశాలాక్షి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలు చర్చకు వచ్చాయి. సర్పంచులు మజ్జిగ గోపాల్, ఆర్.గురుమస్తాన్ మాట్లాడుతూ తమ గ్రామాల్లో విద్యుత్తు సమస్యలు నెలకొన్నాయని వాటికి పరిష్కరించడానికి సిబ్బంది, అధికారులు రావడం లేదన్నారు. మండలానికి ట్రాన్స్ కో అసిస్టెంట్ ఇంజనీర్ లేరని, ఎడిఇ సాయిశంకర్ కి ఫోన్ చేస్తే సాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. అధికారులు చర్యలు చేపట్టి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ మండలాధికారులు వారి శాఖల పనితీరును వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఎస్.తిరుపాలమ్మ, ఎంపిడిఒ డి.ప్రభాకర్, తహశీల్దార్ డి.ఓబిలేసు, ఇఒఆర్‌డి శివాజీరెడ్డి, సిడిపిఒ ఎన్.ఢిల్లేశ్వరి, ఎంఇఒ బి.రవినాయక్, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, హౌసింగ్ ఎఇలు మల్లేష్‌నాయక్, అశ్విని, సూర్యనారాయణ, ఎపిఎం అరుణకుమారి, సర్పంచులు పి.భరత్‌కుమార్, ఎ.వెంకటేష్, కె.రమేష్‌నాయుడు, బేడల లక్ష్మీదేవి, ఎ.లావణ్య, చిన్న ఆంజనేయులు, పాపన్న, ఎంపిటిసిలు ఎం.ధనుంజయ, చిన్న ఈరన్నగౌడ్, జింకల నారాయణస్వామి, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

డిసిహెచ్ఎస్ డాక్టర్ వి.పాల్ రవికుమార్

రోగులలో మాట్లాడుతున్న డిసిహెచ్ఎస్ డాక్టర్ వి.పాల్ రవికుమార్

ప్రజాశక్తి-ఉరవకొండ

వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించకపోతే చర్యలు తప్పవని డిసిహెచ్ఎస్ డాక్టర్ వి.పాల్ రవికుమార్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిని స్థానిక వైద్యాధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆసుపత్రిలోని ల్యాబ్, ఒపికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. తర్వాత చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి సరైన చికిత్స చేస్తున్నారా.. లేదా.. అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదన్నారు. స్నేహపూర్వకంగా మెలిగి వైద్యం అందించాలన్నారు. వైద్యం కోసం వచ్చిన వారికి రక్త పరీక్షల కోసం ప్రయివేటు పరీక్ష కేంద్రాలకు పంపరాదన్నారు. అన్నిరకాల పరీక్షలు ప్రభుత్వాసుపత్రిలో ఉన్నప్పటికీ ప్రయివేటు సెంటర్లకు ఎందుకు పంపుతున్నారని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకోసారి పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇకపోతే హెచ్ఎంపివీ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ఎవరూ భయాందోళన చెందవద్దన్నారు. జాగ్రత్తలు తీసుకుంటే రూపుమాపుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు చౌదరి, గంగాధర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'కాక్లియర్'కు ఉచిత శస్త్రచికిత్స

శశి ఇఎన్‌టి స్పెషాలిటీ ఆసుపత్రి,
డాక్టర్ ఆర్.రాఘవేంద్ర

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

పంచేంద్రియాల్లో చెవి కూడా ఒకటి. చెవిలో సమస్యల వల్ల వినికిడి లోపం ఏర్పడితే ఏ వ్యక్తికైనా ఆ పరిస్థితి చెప్పడానికి వీలుకాదు. ఎదుటివారు ఏం మాట్లాడినా ఎలాంటి శబ్ధాలు సంభవించినా సదరు వ్యక్తికి వినిపించదు. ఇలాంటి వారికి నగరంలోని సాయినగర్ 5వ క్రాస్‌లో ఉన్న శశి ఇఎన్‌టి స్పెషాలిటీ క్లినిక్‌లో ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందస్తున్నారు. ఈ సందర్భంగా శశి ఇఎన్‌టి స్పెషాలిటీ క్లినిక్ వైద్యులు ఆర్.రాఘవేంద్రరెడ్డి ప్రజాశక్తితో మాట్లాడుతూ పుట్టుకతోనే మూగ చెవులు ఉన్న వారికి, పుట్టుకలో బాగా వినపడుతూ ఉండి మధ్యలో వినికిడి కోల్పోయిన వారికి కాక్లియర్ శస్త్ర చికిత్స చేయనున్నట్లు తెలిపారు. వినికిడి ఎంతోకొంత ఉన్నవారికి హియరింగ్ ఎయిడ్ ఉపయోగిస్తే సరిపోతుందన్నారు. దగ్గర నుంచి పిలిచినా పూర్తిగా వినిపించని వారికి ఈ చికిత్స ద్వారా మేలు జరుగుతుందన్నారు. సాధారణంగా పుట్టుకతోనే మూగ, చెవుడు ఉన్నవారికి చెవి లోపల నత్తపైన ఉన్న గవ్వ ఆకారంలో చెవిలోపల ఒక భాగం ఉంటుందన్నారు. దీన్ని కాక్లియర్ అంటారన్నారు. శబ్ధాలు ఈ కాక్లియర్ ద్వారా మెదడుకు చేరుతాయి. అయితే ఈ కాక్లియర్ పని చేయకపోవడం వల్ల వారికి పూర్తిగా వినపడదన్నారు. మామూలుగా చిన్న పిల్లలు చప్పట్లు కొట్టినా ఏవైనా శబ్ధాలు చేసినా ఉలిక్కిపడటం తిరిగి చూడటం చేస్తారు. ఇలాంటి లక్షణాలు లేకపోతే వారికి పుట్టుకతోనే చెవుడు ఉన్నట్లు గ్రహించాలన్నారు. అలాంటి వారికి వెంటనే బేరా అనే పరీక్ష చేయించాలన్నారు. దీని ద్వారా ఈ కాక్లియర్ పని చేస్తుందా.. లేదా.. అనేది తెలుసుకోవచ్చున్నారు. ఈ పరీక్ష చిన్నపిల్లల నుంచి ఏ వయసు వారికైనా చేయించవచ్చున్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈ చికిత్సను ప్రయివేటు ఆసుపత్రుల్లో చేయిస్తే రూ.7 నుంచి రూ.8లక్షల వరకూ ఖర్చు అవుతుందన్నారు. పేద, మధ్యతరగతి వారిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్స చేయిస్తోందన్నారు. అనంతపురం జిల్లాలో తాను మాత్రమే ఈ చికిత్స చేస్తున్నట్లు తెలిపారు. ఇదివరకే కొంతమందికి విజయవంతంగా శస్త్రచికిత్స చేశానన్నారు. కావున సమస్య ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాష్ట్రానికి ప్రత్యేక నిధులివ్వాలని ఎంపి వినతి

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక నిధులు ఇవ్వాలని ఎంపి అంబికా లక్ష్మీనారాయణ కోరారు. గురువారం బెంగళూరులోని రాడిసన్ బ్లూ హోటల్‌లో జరిగిన సెంట్రల్ సిల్క్ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎంపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పట్టు పరిశ్రమ అభివృద్ధికి అనేక కీలక అంశాలు ప్రస్తావించి వినతిపత్రాలు అందజేశారు. ముఖ్యంగా రాష్ట్రానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని, రైతులకు ఇన్సెంటివ్ అందించాలని, రీలింగ్ యూనిట్ మెషిన్లకు జీఎస్టీ రద్దు చేయాలని, రేకుల షెడ్డు నిర్మాణ రూ.10 లక్షల వరకూ నిధులు పెంచాలని, హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్‌కు రూ.8కోట్లు, పలమనేరు పట్టుగూళ్ల మార్కెట్‌కు రూ.5కోట్లు మంజూరు చేయాలని కోరారు.

అడవుల సంరక్షణకు చర్యలు

జిల్లా అటవీ శాఖ అధికారి విగ్నేష్ అప్పావు

ప్రజాశక్తి-పామిడి

జిల్లాలోని అడవుల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి విగ్నేష్ అప్పావు తెలిపారు. గురువారం స్థానిక ఫారెస్ట్ బంగ్లా నర్సరీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం అనుంపల్లి ప్లాంటేషన్, నాగసముద్రం ప్లాంటేషన్, పందికుంట ప్లాంటేషన్, తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్లాంటేషన్ రేజ్ చేస్తున్నామన్నారు. మట్టి సమస్యను (ఎస్ఎంసి) చెక్‌డాంలు, నీటి గుంతలు, నీటి సంరక్షణ, మొదలగు కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ముఖ్యంగా అడవి పరిరక్షణకు చర్యలు చేపడుతున్నామన్నారు. ప్లాంటేషన్ కోసం నర్సరీలను విస్తృతం చేస్తున్నట్లు వివరించారు. డిఎఫ్ఓ వెంట గుత్తి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మధుబాబు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కరీముల్లా, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ చంద్ర, ఫారెస్ట్ సిబ్బంది ఉన్నారు.

నీటిఇబ్బంది రానీయొద్దు : ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

రాబోయే వేసవి కాలంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఇందులో భాగంగా కార్యాలయ ఆవరణలోని నీటి ట్యాంకులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీటికి ఎలాంటి ఇబ్బంది ఉండకూడదన్నారు. మోటార్లు, పైప్‌లైన్లకు ఏవైనా మరమ్మతులు ఉంటే ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. మండల ప్రజలకు తాగునీటి ఇబ్బందులను లేకుండా చూడాలన్నారు. రాబోయే ఎన్నికల కాలంలో దీనిపై మరింత దృష్టి పెట్టి సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ రాంగోపాల్‌రెడ్డి, ఎఇ వీరప్రసాద్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

పుట్లూరు : గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహశీల్దార్ శేషారెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో ఎక్కువగా వచ్చినవి కొలతలకు సంబంధించిన సమస్యలు వచ్చాయన్నారు. ఆయా అర్జీలను విఆర్‌ఓలు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిటి మల్లేష్‌ప్రసాద్, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పామిడి : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ తేజోష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు హాజరుకావాలని కోరారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

నార్పల : మండల పపరిధిలోని పప్పూరు ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు చెన్నకేశవ వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో గురువారం పౌష్టికహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చంద్రశేఖర్‌రెడ్డి, స్రవంతి దంపతులు మాట్లాడుతూ నవమాసాలు గర్భంలోని బిడ్డను మోసి పురిటి నొప్పులను భరించి బిడ్డకు జన్మనిచ్చే తల్లులకు సాయం చేయడం చాలా సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మహేందర్‌నాథ్, హాజీరా, ఎంపిహెచ్ఇఒ మల్లికార్జున, పర్యవేక్షకులు శ్రీరాములు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఫాతిమా షేక్ సేవలను ఆదర్శంగా తీసుకోవాలి

ఉరవకొండ : సంఘ సంస్కర్త, మహిళా అభ్యున్నతి కృషి చేసిన ఫాతిమా షేక్ సేవలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలని చాబాల సర్పంచు మల్లెలు జగదీష్ పిలుపునిచ్చారు. గురువారం ఫాతిమా షేక్ జయంతిని పురస్కరించుకుని హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ నియోజకవర్గ అధ్యక్షులు ముల్లా టైలర్ లాలుసాహెబ్ ఆధ్వర్యంలో ఉరవకొండలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఎం అధ్యక్షులు రహంతుల్లా, సభ్యులు రఫిక్, మైలారంపల్లి బాషా, టైలర్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు గోకులం షెడ్లు ప్రారంభం

నార్పల : మండల పరిధిలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన గోకులం షెడ్లను శుక్రవారం ప్రారంభించనున్నట్లు ఎంపిడిఒ గంగావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బండ్లపల్లి, వెంకటాంపల్లి, గూగూడు గ్రామాల్లో నిర్మించుకుని గోకులం షెడ్లను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఎస్‌టియు డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

పామిడి : మండల కేంద్రంలోని ఎంఆర్‌సి కార్యాలయంలో ఎస్‌టియు రూపొందించిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు అధ్యక్షులు వై.రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి వి.చంద్రశేఖర్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎ.నాగభూషణం, సీనియర్ ఎల్ఎఫ్ఎల్ ఉపాధ్యాయులు డి.కుళ్లాయప్ప, రాష్ట్ర కౌన్సిలర్ రమేష్, సి.రామాంజనేయులు, కె.రామాంజనేయులు, రూపా భవానీ, రానీసంయుక్త, ధనలక్ష్మి, సుభాషిని, రోజు మేరీ, జి.రామాంజనేయులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

11న వడ్డే ఓబన్న జయంతి

యాడికి : వడ్డెర్ల ఆరాధ్యదైవం, స్వాతంత్ర్య సమరయోధులు వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిఏటా జనవరి 11న అధికారికంగా నిర్వహించాలని హర్షణీయమని వడ్డెర సంఘం నాయకులు అన్నారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో ఉన్న గాంధీ విగ్రహం వద్ద ఓబన్న చిత్రపటం, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు డేరంగుల నాగ శేఖర్, మధురాజు, వల్లపు రాము, రవి, శివ మంజుల మనోహర్, రామకృష్ణ, మహేష్, సుధాకర్, రాంబాబు, చిన్న సుధాకర్, నాగరాజు, పాండు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఎఫ్ క్యాలెండర్ల ఆవిష్కరణ

గుత్తి : మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను గురువారం పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఎఫ్ ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు, నాయకులు జన్నే కుళ్లాయిబాబు, రాజు, గంగాధర్, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు సంక్రాంతి సంబరాలు

యల్లనూరు : మండల వ్యాప్తంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పశువుల షెడ్ల నిర్మాణాలను ప్రారంభించి సంక్రాంతి సంబరాలను నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ వాసుదేవరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 69 షెడ్లు మంజూరు కాగా 22 షెడ్లు పూర్తియినట్లు తెలిపారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

మృతిచెందిన శివ

గుత్తి : కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జి.ఎర్రగుడి గ్రామానికి చెందిన గుండుసాని శివ(35) గురువారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు జి.ఎర్రగుడి గ్రామానికి చెందిన శివ భవన నిర్మాణ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. ఈ నేపథ్యంలో గత కొన్ని నెలలుగా భార్య వరలక్ష్మితో కుటుంబ సమస్యలు ఉండేవి. కొన్నాళ్లుగా భార్య శివను తీవ్రంగా వేధించింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన శివ గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పైకప్పునకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే ఇంటి తలుపు తీయకుండా ఉండటంతో ఇంటి పక్కన వారు కిటికీలో నుంచి తొంగి చూశారు. ఉరికి విగతజీవిగా వేలాడుతున్న శివను గమనించిన పొరుగింటి వారు తలుపు బద్దలు కొట్టి లోపలకు వెళ్లి కిందకు దించి వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు శివ అప్పటికే మతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. గుత్తి పోలీసులు కేసు నమోదు చేసి జొన్నగిరి పోలీసులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి : మండలంలోని వన్నేదొడ్డి గ్రామ శివారులో ఎన్‌టిపిసి ఎదురుగా గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని కె.ఊబిచెర్ల గ్రామానికి చెందిన మల్లికార్జున పని నిమిత్తం ద్విచక్రవాహనంలో గుత్తి పట్టణానికి వస్తుండగా ఎన్టీపీసీ ఎదురుగా కరిడికొండ వైపునకు వెళ్తున్న మరో ద్విచక్రవాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో ఎడమకాలు విరిగి తీవ్రంగా గాయపడిన మల్లికార్జునను గమనించిన స్థానికులు 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు అనంతపురంకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మద్యం పట్టివేత

పుట్లూరు : మండల పరిధిలోని కోమటికుంట్ల గ్రామంలో అక్రమంగా అమ్ముతున్న మద్యాన్ని పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. కోమటికుంట్లలో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందుకుని కానిస్టేబుల్ శ్రీనివాసులు, ఆదినారాయణ దాడి చేసి మద్యం అమ్ముతున్న నరసింహులును అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 52 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కార్మికులకు చీరలు పంపిణీ

గుంతకల్లు : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమావేశ భవనంలో మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొలక బాల రామాంజనేయులు ఆధ్వర్యంలో 200 మంది మున్సిపల్ పారిశుధ్య మహిళా కార్మికులకు గురువారం చీరలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ ఛైర్‌పర్సన్ నంగినేని భవాని, తహశీల్దార్ రమాదేవి మాట్లాడుతూ సమాజంలో సాటి మనిషికి సేవ చేయాలన్న గుణం బాల రామాంజనేయులుకు ఉండటం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో 1వ పట్టణ సిఐ మనోహర్, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి ధనుంజయ, ఉపాధ్యక్షుడు దశరథరాం, జిల్లా అధ్యక్షులు మహదేవ్ (మధు), ప్రచార కార్యదర్శి చాబాల రామాంజనేయులు, మహిళా రాష్ట్ర కార్యదర్శి పుష్పాంజలి, నాయకులు జగ్గలి రమేష్, శివ, తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధులను మెరుగుపరచాలి

గుత్తి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల అమలు, జీవనోపాదులను మెరుగుపర్చాలని మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా సూచించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎంఎస్ఎంఇ, హెచ్హెచ్ జియో ట్యాగింగ్, ఎన్ పిసిఎల్ లింక్, పిఎసికెఎస్, మిస్సింగ్ ఎంప్లాయిస్ సర్వే, క్యాస్ట్ సర్వే తదితర నిర్దేశిత సర్వేలను నిర్దేశించిన కాల

ముందస్తు సంక్రాంతి సంబరాలు

శ్రీచైతన్యలో భోగి పళ్లతో చిన్నారులను ఆశీర్వదిస్తున్న ఎజిఎం సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన సంక్రాంతి వేడుకలను ఎజిఎం సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఇందులో భాగంగా పిల్లల తలలపై భోగి పళ్లు పోశారు. అనంతరం పిల్లలందరికీ సంక్రాంతి పండుగ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తబస్సుం, ఎఒ గోపాల్, అకాడమిక్ కోఆర్డినేటర్ ఇర్షాద్, డీన్లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్, ప్రైమరీ ఇన్‌ఛార్జి భారతి, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

నగర సమీపంలోని పివికెకె కళాశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలను వైభవంగా నిర్వహించారు. విద్యార్థి కార్యకలాపాలు, మహిళా సాధికారత విభాగాలు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర, శ్రీ బాలాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ కలిసి సంప్రదాయ ప్రకారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఇందులో భాగంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ పల్లె కిషోర్, కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ పి.దీప్తి జోర్దన, కళాశాల ఎఒ కె.మనోహర్‌రెడ్డి, ఎస్‌ఎసి కన్వీనర్ ఆనంద్, డబ్ల్యూఈసీ కన్వీనర్ ఎ.పావని, కో-కన్వీనర్లు మనోజ్‌కుమార్, వై.మమత, హెచ్ఎస్ విభాగం అధిపతి టి.నరసప్ప విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక సంఘమేష్ నగర్, గుత్తిరోడ్డులోని మాంటిస్సోరి పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాలల ప్రాంగణాలను రంగవల్లులు, తోరణాలు, పతంగులతో అలంకరించారు. అనంతరం బాలికలకు రంగవల్లుల పోటీలు, బాలురకు పతంగుల పోటీలు నిర్వహించారు. చిన్నారులకు బోగిపండ్లతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సూర్యనారాయణరెడ్డి, పాఠశాల కార్యదర్శి మాధవి, ప్రిన్సిపాల్ పద్మావతి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నగరంలోని ఆజాద్‌నగర్‌లో ఉన్న నవభారత్ పాఠశాలలలో ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా పాఠశాలల ప్రాంగణాలను రంగవళ్లులు, తోరణాలతో అలంకరించారు. తర్వాత బాలికలకు రంగవళ్లుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. గంగిరెద్దు, హరిదాసు వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నిట్టూరు శశిభూషణ్, ప్రినిపాల్ నిట్టూరు కృష్ణవేణి, నిట్టూరు అనిత, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నవభారత్ పాఠశాలలో ముగ్గులపై వస్తున్న హరిదాసు

గుంతకల్లు : పట్టణంలోని ఉరవకొండ రోడ్డులో ఉన్న శ్రీ వివేకానంద ఆంగ్ల మాధ్యమం ఉన్నత పాఠశాలలో పాఠశాల డైరెక్టర్ మంజునాథ్, కరస్పాండెంట్ ఓంకారప్ప ఆధ్వర్యంలో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. తర్వాత హరిదాసు కీర్తనలు, కోడిపందేలతో పండుగ వాతావరణం కనిపించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రదానోపాధ్యాయిని నాగమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని పలు పాఠశాలల్లో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని మిత్ర, ఎల్ఎస్ఆర్ డబ్ల్యు, సరస్వతి విద్యామందిరం, ఉషోదయ, పూజిత, నేతాజీ తదితర పాఠశాలల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాలల కరస్పాండెంట్లు లక్ష్మీ, శశికళ, రమాదేవి, శిరీషా, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్, జనార్ధన్, ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, ఉమామహేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యాడికి : మండల పరిధిలోని రాయలచెరువులో ఉన్న న్యూ వికాస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలకు పండుగలు ప్రతీకలు అన్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి పాఠశాల ఆవరణలో తీపి పొంగల్ చేసి పంపిణీ చేశారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి రజిత, ఉపాధ్యాయులు అనిత, అమల, షకీలా, జాహ్నవి, ధరణి, సంధ్య, రమాదేవి, ప్రియాంక, వెంకటపతిరాజు, మహబూబ్‌బాషా, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల కేంద్రంలోని రాయలసీమ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో గురువారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో విద్యార్థినీ, విద్యార్థులకు గాలిపటాలు, ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎస్.రమేష్‌రెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.